క్లుప్తంగా

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

నర్సీపట్నం: అనారోగ్యంతో బాధపడుతున్న మున్సిపాలిటీకి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థిని పద్మశ్రీకి స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ తరఫున రూ.10 వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మహేశ్వరరావు, సూర్యకళ, ఉపాధ్యాయులు ఎం.చిట్టియ్య, సత్యవేణి, యేసు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు సీలింగ్ ఫ్యాన్ల వితరణ



ఉపాధ్యాయులకు సీలింగ్ ఫ్యాన్లు అందిస్తున్న సర్పంచ్ జగన్

దేవరాపల్లి: ఎం. అలమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండు సీలింగ్ ఫ్యాన్లను సర్పంచ్ దాడి జగన్ వితరణగా ఇచ్చారు. వేసవి నేపథ్యంలో పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు సమకూర్చాలని హెచ్‌ఎం అరుణకుమారి, ఉపాధ్యాయులు కోరడంతో వీటిని ఆయన శనివారం అందజేశారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు పాలిపిరెడ్డి రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

నేత్ర వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి: వేచలం పాల కేంద్రం వద్ద ఆదివారం వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు తెలిపారు. విశాఖపట్నం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది రోగులను పరీక్షిస్తారన్నారు. ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



లింగంపేటలో ఎడ్ల పందేలు జరుగుతున్న దృశ్యం

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి పండగ సందర్భంగా శనివారం డివిజన్ స్థాయి ఎడ్ల పందేలు ఉత్సాహంగా నిర్వహించారు. కొత్త అమావాస్య సందర్భంగా ఇక్కడ వారం రోజులు పాటు తీర్థాలు నిర్వహిస్తారు. ఐదో రోజు శనివారం నిర్వహించిన పందేల్లో చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, రోలుగుంట తదితర పండలాల నుంచి ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. సిరికి దుర్గా ప్రసాద్ ఎడ్లకు ప్రథమ స్థానం, ఎం రామకృష్ణ ఎడ్లకు ద్వితీయ స్థానం దక్కాయి. వీరికి ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, రాష్ట్ర శెట్టిబలిజ డైరెక్టర్ రాజు, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, పాసింబిల్లి మంగరాజు, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు



పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

మాకవరపాలెం: ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యమని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. యరకన్నపాలెంలో జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.22 లక్షలతో చేపట్టనున్న ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులకు శనివారం ఆయన జెడ్పీటీసీ సత్యవేణితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు భద్రాచలం, దొరబాబు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



పరీక్షల మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

రోలుగుంట: బుచ్చింపేట హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శనివారం స్థానిక నవతరం సంఘం సభ్యులు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ పంపిణీ చేశారు. తమ సంఘం ప్రారంభమై మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వీటిని అందించామని సంఘ సభ్యులు సబ్బవరపు చంటి, కర్రి ఎరుకునాయుడు, అనిమిరెడ్డి రమణ తెలిపారు. హెచ్‌ఎం నర్సింహరావు అభినందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా



వెలుగు కార్యాలయంలో మాట్లాడుతున్న జగన్నాథరావు



కొత్తకోటలో కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

మాకవరపాలెం: అన్ని వర్గాల అభివద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని తామరంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా నగదు విడుదల సందర్భంగా శనివారం సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు హరిబాబు, భద్రాచలం, చిటికెల రమణ, సర్పంచ్ గొంతిన చెల్లారత్నం పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే ముఖ్యమంత్రి జగనన్న

రావికమతం: అనుకున్న సమయానికే ఎన్నికల హామీ నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడైనా చూశామా అని మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు తెలిపారు. మూడో విడత వైఎస్సార్ ఆసరా నగదు విడుదల సందర్భంగా దెందులూరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభ కార్యక్రమాన్ని స్థానిక వెలుగు కార్యాలయంలో టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ ఇంతటి మహిళా పక్షపాతి ముఖ్యమంత్రిని దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. కొత్తకోట, కవగుంట గ్రామాల్లోనూ ఆసరా కార్యక్రమాలు నిర్వహించారు. సీఎం జగన్ మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న విధానం గురించి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కొత్తకోట గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందేల దేవా, కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు పాల్గొన్నారు.

ఉచిత సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

చోడవరం రూరల్: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం మేరకు ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు నిరుపేద, అనాథ పిల్లలకు కేటాయించడానికి వీలుగా 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన వారు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు, అనాథలు, దివ్యాంగులకు ఐదు శాతం, ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలకు చెందిన బీసీ, మైనార్టీ, ఈబీసీ వారికి ఆరు శాతం సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశం కల్పిస్తారని, ప్రవేశం పొందిన పాఠశాలలు వీరికి ఉచితంగా విద్యా బోధన చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతంలోని బలహీన వర్గాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులు లక్షా 20 వేల రూపాయల తలసరి ఆదాయం, పట్టణ ప్రాంతవాసులైతే లక్షా 44 వేల రూపాయల వార్షికాదాయం ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. ఇతర వివరాల కోసం 14417 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలపై వినతి

కె.కోటపాడు: పంచాయతీ కార్మికులకు ఆర్నెల్లుగా వేతనాలు మంజూరు కాకపోవడంతో ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గండి నాయినిబాబు అన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలపై మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మికి శనివారం ఆయన వినతిపత్రం అందించారు. పంచాయతీ కార్మిక కుటుంబాల్లో మరణించిన వారికి రూ.5 వేలు దహన సంస్కారాల నిమిత్తం ఇవ్వాలని కోరారు. సీపీఎం నాయకుడు యర్రా దేముడు, నాయుడుబాబు, వనుము దేముడు పాల్గొన్నారు.

భక్తులకు మంచినీటి సదుపాయం



బోరును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: పి. భీమవరం రహదారిలో కొత్తగా నిర్మించిన శివాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం తాగునీటి బోరును జెడ్పీటీసీ దొండా రాంబాబు శనివారం ప్రారంభించారు. ఇటీవల ఎల్.బి. పురం, బంగారుమెట్ట, చిన అప్పనపాలెం, పి. భీమవరం గ్రామాల మధ్యలో కొంతమంది భక్తులు శివాలయం నిర్మించారు. ఇక్కడ మంచి నీటి సదుపాయం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సహకారంతో జెడ్పీటీసీ రాంబాబు తన జెడ్పీ నిధులు నుంచి మంచి నీటి బోరు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తమరాన శ్రీను, పినపోలు రామునాయుడు, ఎల్లపు విజయ్‌కుమార్, పెద్దాడ నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, నాయకులు తమరాన దాసు, కోవెల ఈశ్వరరావు, దొండా రాజా, శ్రీను, ఎస్ నానాజీ, గుడాల ఆనంద్, గొంపా అప్పారావు, మణికంఠ, జగ్గారావు, శేషు పాల్గొన్నారు.

4 నుంచి క్రికెట్ పోటీలు

మాకవరపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చే నెల 4 నుంచి మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఈ నెల 28న జట్లు ఎంపికకు హాజరు కావాలని కోరారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.45 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9160356590 లేదా 9866953812 సంప్రదించాలన్నారు.

రూ.10 లక్షలతో సుందరకోట- అసనగిరి రోడ్డు నిర్మాణం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: కొండల మీదనున్న సుందరకోట గ్రామం నుంచి అసనగిరి మధ్య కాలిబాటను మెటల్ రోడ్డుగా మార్చేందుకు రూ.10 లక్షలు మంజూరయ్యాయని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. శనివారం సుందరకోట వద్ద ఈ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ హయాం నుంచి నేటి వరకు కొండల మీద గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇటీవల కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి అసనగిరి గ్రామ గిరిజనులు స్థితిగతులను స్వయంగా పరిశీలించారన్నారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కూడా కలెక్టరు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారన్నారు. అందులో భాగంగానే ముందుగా మూడు కిలోమీటర్ల మేర మెటల్ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. పంచాయతీరాజ్ శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ, సుందరకోట సర్పంచ్ కొండపల్లి చింతల్లి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండపల్లి రాజు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులపై దృష్టి సారించాలి

దేవరాపల్లి: ప్రత్యేక అవసరాల చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి విద్యా బోధన చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్‌ను అందజేసి ముచ్చటించారు. అక్కడే వారితో కొద్ది సేపు గడిపారు. శారీరక అంగవైకల్యం చిన్నారులకు ఫిజియోథెరపీ అందించాలని రిసోర్స్ పర్సన్ కె. శ్రీదేవికి సూచించారు. ఇంటి వద్ద వారి పనులు వారే చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ పాల్గొన్నారు.

వచ్చే నెల నుంచి ఉపాధి కూలి రూ. 272

చోడవరం క్లస్టర్ డ్వామా ఏపీడీ శ్రీనివాసరావు



దేవరాపల్లి హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న డ్వామా ఏపీడీ శ్రీనివాసరావు

దేవరాపల్లి: ఉపాధి హామీ కూలీలకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 257 సరాసరి దినసరి కూలికి అదనంగా రూ. 15 కలిపి రూ. 272కు ప్రభుత్వం పెంచిందని డ్వామా చోడవరం క్లస్టర్ ఏపీడీ బి. శ్రీనివాసరావు అన్నారు. వచ్చే నెల నుంచి ఇది అమలులోకి వస్తుందన్నారు. స్థానిక హౌసింగ్ లేఅవుట్‌ను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావుతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఎంపీపీ అభ్యర్థన మేరకు సమీప చెరువునీటితో లేఅవుట్ కోతకు గురికాకుండా ఉపాధి హామీ పథకం నిధులతో వరదగట్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి చేయాలని సంబంధిత సిబ్బందికి ఏపీడీ సూచించారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీవో చంద్రకళ ఆధ్వర్యంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. మండలంలో 2021–2022కు సంబంధించి సామాజిక తనిఖీల రికార్డులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఈసీ కె. శ్రీనివాసరావు తదితర్లు పాల్గొన్నారు.


ఎన్‌ఎంఎంఎస్‌కు 10 మంది విద్యార్థుల ఎంపిక



ఉషశ్రీ



జయశ్రీ



జ్ఞానేశ్వరి

చోడవరం రూరల్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.12 వేల వంతున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తుంది. 9, 10 తరగతులతోపాటు ఇంటర్మీడియట్ రెండేళ్లు సాలీనా స్కాలర్‌షిప్ అందుతుంది. పట్టణ శివారు గాంధీ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దీపాక్షిక, లావణ్య, సత్యమాధురి, కృష్ణ చైతన్య స్కాలర్‌షిప్ పొందడానికి అర్హత సాధించినట్టు హెచ్‌ఎం ఎస్.శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఎంపికైన వారిని పేరెంట్స్ కమిటీ చైర్మన్ డి.పార్వతి, వైస్ చైర్మన్ ఎస్.గోవింద్, హెచ్‌ఎం శ్రీనివాస్, డ్రిల్లు టీచర్ రమేష్ అభినందించారు.

బుచ్చెయ్యపేట: ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో చంద్రశేఖర్, వడ్డాది హెచ్‌ఎం శేషుబాబు అభినందించారు. వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పి. వేద విద్య, బి. ఈశ్వరప్రసాద్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటరావు, టీచర్లు శ్రీను పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థిని శ్రీలలిత ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైంది. ఆమెతోపాటు తర్ఫీదు ఇచ్చిన సైన్స్ టీచర్ మాకిరెడ్డి నానిని శనివారం పాఠశాలలో హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు కిరణ్ దారబాబు, సతీష్ తదితరులు అభినందించారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం జెడ్పీ హైస్కూలు నుంచి విద్యార్థినులు ఆడారి ఉషశ్రీ, పోలమరశెట్టి జయశ్రీ, దిమిలి జ్ఞానేశ్వరి ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం వి. దాసు శనివారం తెలిపారు. వీరితోపాటు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయుడు పోలిమేర చంద్రరావును అభినందించారు. కింతలి జెడ్పీ హైస్కూలుకు చెందిన మైచర్ల రమ్యశ్రీ ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్. నర్సింగరావు తెలిపారు.

చోడవరంలో భారీ వర్షం

చోడవరం: భారీ వర్షంతో చోడవరం పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతోపాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాసినప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో మెయిన్‌రోడ్డుతో పాటు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరో పక్క ఉరుములతో జనం బెంబేలెత్తిపోయారు. రైతులు ప్రాణాలు అరచేత్తో పట్టుకుని పొలాల్లోంచి పాకల్లోకి పరుగులు తీశారు. రాత్రి వరకూ విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

హౌసింగ్ ఏఈని నిలదీసిన సర్పంచ్‌లు

రసాభాసగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: ఎంపీపీ వేమవరపు రామధర్మజ అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఇళ్ల బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గృహ నిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణను ఎం. కోటపాడు సర్పంచ్ శానాపతి శేషఫణి గంగాధర్, ఒమ్మలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డపు భాస్కరరావు, ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి నిలదీశారు. ఇల్లుగానీ, బిల్లులుగానీ మంజూరైనప్పుడు చెప్పకపోతే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అటవి కలప అక్రమంగా తరలిపోతుంటే, ఆ శాధికారులు చోద్యం చూస్తున్నారని ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. కాంట్రాక్టరుపై ఒత్తిడి తీసుకొచ్చి ఎం.కోటపాడు ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంపై ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనువాస్‌పై ఎంపీపీతోపాటు ఏం.కె.వల్లాపురం సర్పంచ్ లక్ష్మి, తదితర సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలగెడ్డ కాలువ పనులు పూర్తి చేసి 150 మంది రైతులను ఆదుకోవాలని ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి, సర్పంచ్ కళావతి కోరారు. సంక్షేమ పథకాల వివరాలు ప్రతి సచివాలయంలో నోటీస్ బోర్డుపై అంటించాలని, సభలు, సమావేశాలకు ప్రొటోకాల్ పాటించాలని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఎంపీడీవో మీనాకుమారి దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ పీవీరత్నం, ఎంఈవో దేముడమ్మ, బీసీ వెల్ఫేర్ సహాయ అధికారి నరసింహులు, ఇరిగేషన్ జేఈ భార్గవ కుమార్, ఐసీడీఎస్ పీవో శ్రీదేవి, మాడుగుల సీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



కాశీపురం హైస్కూల్‌లో జానపద గీతాలకు విద్యార్థినుల నృత్య ప్రదర్శన



మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

కె.కోటపాడు: ప్రతీ విద్యార్థి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణతను సాధించాలని హెచ్‌ఎం బి.సూర్యనారాయణమూర్తి ఆకాంక్షించారు. శనివారం స్థానిక హైస్కూల్‌లో పది విద్యార్థుల వీడ్కోలు వేడుక ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పీఎంసీ కమిటీ చైర్మన్ బోకం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష మెటీరియల్ వితరణ

దేవరాపల్లి: ముషిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, మండలాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.వి.రమణ మాట్లాడుతూ పదిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తే రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకం అందజేస్తామని ప్రకటించారు. హెచ్‌ఎం ఉదయ్‌భాస్కర్, ఆంగ్ల ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు.

కాశీపురంలో.. హెచ్‌ఎం ఎం. నాగమణి ఆధ్వర్యంలో కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఇక్కడ పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులంతా ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థుల జానపద నృత్య ప్రదర్శనలు, సందేశాత్మక నాటికలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాసరి సూర్యనారాయణ, బండారు దేముడునాయుడు, ఆదిరెడ్డి అక్కునాయుడు, సీఆర్పీ ఆదిరెడ్డి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయండి



కె.కోటపాడు: ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి



గొలుగొండ: అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో డేవిడ్‌రాజు



పెదగొలుగొండపేటలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి

కె.కోటపాడు: ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. కె.సంతపాలెం జగనన్న కాలనీలో లబ్ధిదారులతో శనివారం ఆమె మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల స్థాయిని బట్టి నగదు చెల్లింపులు చేస్తామన్నారు. ఎంపీడీవో శచీదేవి, హౌసింగ్ ఏఈ బి.రవి బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రామారావు, గోవింద పాల్గొన్నారు.

గొలుగొండ: ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో డేవిడ్‌రాజు తెలిపారు. తన కార్యాలయంలో పంచాయతీ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రస్తుతం 1,068 ఇళ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. గృహ నిర్మాణశాఖ ఏఈ మధు, ఏపీఎం మంగ పాల్గొన్నారు.

నాతవరం: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులంతా యుద్ధప్రాతిపదికన ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జి. వెంకటలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో లక్ష్యాన్ని అధిగమించి కూలీలకు పని కల్పించాలన్నారు. ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, ఈవోపీఆర్డీ ప్రేమలీల, ఎంపీటీసీ తమరాన సత్యనారాయణ, సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

దేవరాపల్లి: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని సర్పంచ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఎం. అలమండ గ్రామ సచివాలయ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాతవరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సక్రమంగా తీసుకున్నట్లయితే రక్తహీనత నివారించవచ్చునని నాతవరం, గన్నవరం సెక్టారు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎ.విజయలక్ష్మి, ఎ.నాగజ్యోతి తెలిపారు. శనివారం గునుపూడిలో పోషణ్ పక్వాడాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గునుపూడి హైస్కూల్ హెచ్‌ఎం ఎల్.సిహెచ్.పాత్రుడు, సీఆర్పీ పోలుపర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆ వివాహాలతోనే జన్యుపరమైన శిశువుల జననం



మేడివాడలో అవగాహన ర్యాలీ

రావికమతం: బాల్య వివాహాలు, మేనరికపు వివాహాలు వల్లే డౌన్ సిండ్రోమ్ (జన్యుపరమైన) వ్యాధితో బిడ్డలకు జన్మనిస్తున్నారని హెచ్‌ఎం జయలక్ష్మి తెలిపారు. మేడివాడ సహిత విద్యా విభాగం కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేనరికపు, తక్కువ వయసు ఉన్నవారి గర్భస్థ శిశువుల్లో ఒక జత క్రోమోజోమ్ అదనంగా ఉంటుందన్నారు. దీని ప్రభావం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల సరిగా ఉండని బిడ్డలు పుడతారన్నారు. ఇలా దేశంలో ఏటా 13 లక్షల మంది జనిస్తున్నారని వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు, ఉపాధ్యాయులు గోవిందరావు, ఎర్రయ్య పాల్గొన్నారు.